# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- అర్హత కలిగిన ప్రతి ఓటరును చేర్చడం ద్వారానే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ పేర్కొన్నారు.
- అంతర్జాతీయంగా జరిగే అనేక ఆవిష్కరణలకు భారతదేశం కీలక చోదక శక్తిగా మారుతోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రపంచం సహించకూడదని విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ అన్నారు.
- అటల్ పెన్షన్ యోజనను 2030-31 ఆర్థిక సంవత్సరం వరకూ కొనసాగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టీ-20 క్రికెట్ మ్యాచ్ నాగ్‌పూర్ వేదికగా జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్యానికి బూత్ స్థాయి అధికారులు మూలస్తంభం వంటివారని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐసిడిఇఎం) 2026 సదస్సులో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... అర్హత కలిగిన ప్రతి ఓటరును చేర్చడం ద్వారా ఓటర్ల జాబితాలను పారదర్శకంగా నిర్వహించడం అన్నది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని చెప్పారు.

(వాయిస్ 30 సెకన్లు)

మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 70కి పైగా దేశాల నుండి దాదాపు వంద మంది అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రపంచం సహించకూడదని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బరెస్‌తో జైశంకర్ ఈ రోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ... భారత్, స్పెయిన్ రెండూ ఉగ్రవాద బాధిత దేశాలేనని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రపంచ దేశాల సహకారం అవసరమని చెప్పారు.

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయంగా జరిగే అనేక ఆవిష్కరణలకు భారతదేశం కీలక చోదక శక్తిగా మారుతోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. దావోస్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ఆర్థిక వేదిక ప్యానెల్‌లో ఆయన ఈ రోజు మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు (AI) సంసిద్ధతలో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా కీలక స్థానంలో ఉందని స్పష్టం చేశారు. ప్రపంచానికి ఏఐ సేవల విషయంలో భారత్ అతిపెద్ద సరఫరాదారుగా మారుతుందని అంచనా వేస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

అదే విధంగా స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SIDBI)కి ఐదు వేల కోట్ల రూపాయల ఈక్విటీ మద్దతును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం వల్ల 25 లక్షల 74 వేల మందికి పైగా కొత్త ఎంఎస్ఎంఈ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

అటల్ పెన్షన్ యోజనను 2030-31 ఆర్థిక సంవత్సరం వరకూ కొనసాగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అసంఘటిత రంగంలోని కార్మికులకు వృద్ధాప్య దశలో ఆదాయ భద్రతను అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని 2015 మేలో కేంద్రప్రభుత్వం ప్రారంభించింది. న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ద్వారా 60 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత నెలకు వెయ్యి నుండి ఐదు వేల రూపాయల వరకు చందాదారులకు కనీస పెన్షన్ లభిస్తుంది. ఈ పథకం కింద ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా 8 కోట్ల 66 లక్షల మందికి పైగా చందాదారులు చేరారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

సుకన్య సమృద్ధి యోజన కింద 4 కోట్ల 53 లక్షలకు పైగా బ్యాంకు ఖాతాలు ఇప్పటిదాకా దేశంలో తెరిచారని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటి ద్వారా మొత్తం 3 లక్షల 33 వేల కోట్ల రూపాయలకు పైగా డిపాజిట్లు ఉన్నాయని పేర్కొంది. బేటీ బచావో.. బేటీ పఢావో.. ప్రచారంలో భాగంగా ఈ పథకాన్ని 2015 జనవరిలో ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పథకం కింద అందిస్తున్న వడ్డీ రేటు 8.2 శాతంగా ఉంది. బాలిక పుట్టినప్పటి నుండి పదేళ్ల వయస్సు వచ్చే వరకు ఎప్పుడైనా ఈ ఖాతాను తెరవవచ్చు. సుకన్య సమృద్ధి యోజన లక్షలాది మంది బాలికల సాధికారతకు ప్రతిబింబంగా మారింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పలు రాష్ట్రాలలో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ఎదురయ్యే జాప్యాన్ని గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రగతి సమీక్షా సమావేశం నిలుస్తోంది. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగతి వేదికగా పూర్తి స్థాయి సమీక్షలు ప్రారంభించినప్పటి నుంచి అనేక ప్రాజెక్టులకు సంబంధించిన ఆలస్యాన్ని, అవాంతరాలను నివారిస్తూ.. వాటి పరిపూర్తికి బాటలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ ఎయిమ్స్ ప్రగతి సమీక్షల ద్వారా వేగవంతంగా నిర్మాణం పూర్తి చేసిన విషయం గురించి తెలుసుకుందాం.

మంగళగిరి ఎయిమ్స్ 183 ఎకరాలలో విస్తరించి ఉంది. 960 పడకలతో కూడిన ఆసుపత్రి సముదాయంగా దీనిని రూపొందించారు. 1,618.23 కోట్ల రూపాయల ఖర్చుతో దీనిని అభివృద్ధి చేశారు. ఈ సంస్థ 2018లో విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో తాత్కాలిక క్యాంపస్ నుండి కార్యకలాపాలను ప్రారంభించింది. ఇది మార్చి 2019లో దాని శాశ్వత క్యాంపస్ అయిన మంగళగిరిలో OPD సేవలను ప్రారంభించింది. నిర్మాణ సమయంలో AIIMS మౌలిక సదుపాయాల సవాళ్లను ఎన్నో ఎదుర్కొంది. దీంతో 2018 ఏప్రిల్ 25న ప్రగతి వేదికగా నరేంద్ర మోదీ సమీక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధిత కేంద్రమంత్రిత్వ శాఖలకు స్పష్టమైన కాల పరిమితిని నిర్దేశిస్తూ.. ఆదేశాలను జారీ చేశారు. నిర్మాణ కార్యకలాపాలకు ఆటంకం కలిగించే అన్ని అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. దాంతో ఎయిమ్స్ 2023 జనవరి 31న నిర్మాణం పూర్తి చేసుకుంది. 2024 ఫిబ్రవరి 25న ప్రధానమంత్రి అధికారికంగా ఎయిమ్స్ ని ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఆరావళి పర్వత శ్రేణిలో అక్రమ మైనింగ్ కారణంగా ఏర్పడిన సమస్యలపై సమగ్రమైన పరిశీలన చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని సుప్రీంకోర్టు ఈరోజు తెలిపింది. అక్రమ మైనింగ్ కారణంగా ఆరావళి పర్వతాలకు భారీ నష్టం కలుగుతోందని ధర్మాసనం పేర్కొంది. మైనింగ్‌లో నైపుణ్యం కలిగిన పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల పేర్లను నాలుగు వారాల్లోగా సూచించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, అమికస్ క్యూరీ కె. పరమేశ్వర్‌లను ఆదేశించింది. నిపుణుల కమిటీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పని చేస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, న్యూజిలాండ్ మధ్య 5 మ్యాచ్ ల టీ-20 క్రికెట్ సిరీస్ ఈ రోజు నుండి ప్రారంభమైంది. ఈ సిరీలో భాగంగా తొలి మ్యాచ్ నాగ్‌పూర్ వేదికగా జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 16 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. భారత బ్యాట్స్ మెన్లలో ఓపెనర్ అభిషేక్ శర్మ 84, సూర్య కుమార్ యాదవ్ 32 పరుగులతో రాణించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 180 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 271 పాయింట్ల నష్టంతో 81 వేల 909 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 75 పాయింట్లు నష్టపోయి 25 వేల 157 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 91 రూపాయల 73 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.33 వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 862 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =